నేడు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం

హయత్ నగర్, ఏప్రిల్ 16 : హయత్ నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పట్టుబడిన 6 వాహనాలకు గురువారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు హయత్ నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ధనవంత్ రెడ్డి ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల కేసుల్లో పట్టుబడ్డ 6 వాహనాలు,(జీపు- 1, కారు-1, ఆటో-1, స్కూటర్ -1, మోటర్ సైకిళ్ళు -2) నిబంధనల మేరకు నేడు ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం సెల్ : 8712658743 ద్వారా గానీ, లేదా నేరుగా గానీ సంప్రదించగలరని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కందుకూరు , ఏప్రిల్ 16 : పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ లు డిమాండ్ చేశారు. ఐఎన్టీయూసీ , ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఎంపీడీఓ సరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు నెలల నుండి ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని నాయకులు కోరారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎఫ్ టీఎఫ్, పేస్కేల్, ,ఉద్యోగ భద్రత ,హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్ రెడ్డి , ఎంపీ ఓ గీతా , ఫీల్డ్ అసిస్టెంట్ల నాయకులు పాప గాల్ల యాదయ్య ,పెంటయ్య , రవి , శేఖర్, రాజేందర్, రాములు, గణేష్, యాదయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు చేపట్టాలి

సైదాబాద్, ఏప్రిల్ 16: సైదాబాద్ డివిజన్ పరిధి లోని మాధవ్ నగర్ కాలనీలో కొనసాగుతున్న తాగునీటి పైప్ లైన్ పనులు పూర్తికాగానే సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపడతామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి కాలనీవాసులకు తెలిపారు. బుధవారం మాధవ నగర్ కాలనీలో పర్యటించి తాగునీటి పైప్‌లైన్ పనులను, ఇతర సమస్యలను కాలనీవాసులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలో తాగునీటి ఇబ్బందులను తొలగించటం కోసం కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని, వాటి పనులు పూర్తికాగానే నూతన సీసీ రోడ్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తిరుమల్ రెడ్డి, శ్రీపాద్, విశ్వ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థలం పరిశీలన

లింగోజిగూడ డివిజన్ పరిధిలో స్థలాన్ని పరిశీలిస్తున్న పలు విభాగాల ఇంజనీరింగ్ అధికారులు

చంపాపేట, ఏప్రిల్ 16: లింగోజిగూడ డివిజన్ పరిధి ప్రియదర్శిని పార్క్, సరూర్ నగర్ చెరువు సమీపంలో రూ. 5.95 కోట్ల జీహెచ్ఎంసీ నిధులుతో నూతనంగా ఓ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు సాంకేతిక అంచనాలు పూర్తిచేసి అధికారులు ప్రభుత్వానికి కొద్దిరోజుల క్రితం నివేదించారు. ఇందుకు ఇటీవల ప్రభుత్వం ఆమోదించడంతో, బుధవారం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, మెయింటెనెన్స్ సీఈ రత్నాకర్, ఎస్.ఎన్డీపీ సీఈ కోటేశ్వరరావు, చెరువులు, కుంటలు మెయింటెనెన్స్ ఈఈ నారాయణ, ఎస్.ఎన్.డీ.పీ ఈఈ రవి శంకర్, ఎల్బీనగర్ డీసీ సేవాలాల్, డీఈ కార్తీక్, ఎస్ ఎన్ డీపీ డీఈ వెంకట్ కిరణ్, డీఈ రవి చంద్, ఏఎంహెచ్ఓ నాగేష్ నాయక్, ఇరిగేషన్ ఏఈ సతీష్, ఇంజనీరింగ్ విభాగం ఏఈ కీర్తి, వెటర్నరీ అధికారి యాదగిరి, వీరితో పాటు డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖరరెడ్డి, ప్రభుత్వ పలు విభాగాల అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబోయే బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ కూడళ్లలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందన్నారు.అంతే కాకుండా ఈ ప్రాంతంలో వాణిజ్య వ్యాపారాలు బాగా పెరిగి అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యూ నాయకుడు ప్రవీణ్ రెడ్డి, కింది కంటి శ్రీధర్ గౌడ్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కందుకూరు, ఏప్రిల్ 16:మండల కేంద్రంలో గల కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాస వెంచర్ యజమాన్యం నిబంధనలు పాటించకుండా ఫ్లాట్స్ చేసి అక్రమంగా విక్రయిస్తున్నట్లు గ్రామపంచాయతీ మాజీ వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి , సౌడపు శేఖర్ గౌడ్, ఎండి ఖదీర్ లు తెలిపారు. బుధవారం తహసీల్దార్ గోపాల్ కు ఫిర్యాదు చేసిన అనంతరం వారు మాట్లాడుతూ, అధిక వర్షాలు కురవడంతో కందుకూరు మండల చెరువులు నిండి పిల్లి వాగు ద్వారా నీరు ఇబ్రహీంపట్నం చెరువులో కలుస్తోందని చెప్పారు. ఈ వాగును ప్రైవేట్ వ్యక్తులు వెంచర్ లోకి లెవెల్ చేసి కలుపుకోవడం జరిగిందని వివరించారు. ఒక దగ్గర వాగు ఉంటే ఇంకో పక్కన చూపిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ వెంచర్ లోని ప్లాట్లను అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని కోరారు. వాగును సైతం కుదించారని పేర్కొన్నారు. ఈ వెంచర్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. అలాగే రైతు వేదికకు 38 గుంటలు కలెక్టర్ ప్రొసీడింగ్ ఇచ్చారని, రైతు వేదిక ఉండాల్సిన 38 గుంటలు స్థలం లేదని, ఆ భూమిని కూడా ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసి, ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పిల్లి వాగుతో పాటు, కబ్జా చేసిన రైతు వేదిక భూమిని ప్రభుత్వం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బీఆర్ఎస్ రజతోత్సవ సభను

జయప్రదం చేద్దాం

బి.యన్.రెడ్డి నగర్ లో యువతకు గులాబీ పువ్వులు ఇచ్చి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆహ్వానిస్తున్న నరసింహారావు తదితరులు

వనస్థలిపురం ఏప్రిల్ 16 : బీఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు మాధవరం నరసింహారావు కోరారు. బుధవారం బీఎన్‌రెడ్డి నగర్ లో యువకులకు గులాబీ పూలు వచ్చి సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో బీఆర్ఎస్ పాలన ఒక స్వర్ణ యుగం అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమం అన్న విషయాన్ని మర్చిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టేందుకు ఈ సభ ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ పలు జిల్లాల నుండి ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చే శేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావేటి రమేష్ , వెంకట్ రెడ్డి, మేకల శ్రీకాంత్ , చేకూరి భాస్కర్, ప్రశాంత్ రావు, రాఘవేందర్ రెడ్డి, ఉదయ రెడ్డి, శివకుమార్, మనోహర్, నాని, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రవణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన రాఘవాచారి

ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ కుమార్ ప్రమాణస్వీకారం అనంతరం శుభాకాంక్షలు తెలియజేస్తున్న వింజమూరి రాఘవాచారి, తదితరులు

చంపాపేట, ఏప్రిల్ 16: శాసనమండలి సభ్యుడిగా డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ బుధవారం ప్రమాణస్వీకారం చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డితో కలిసి వింజమూరు రాఘవాచారి పాల్గొన్నారు. అనంతం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం గౌరవ అధ్యక్షుడు గౌరవ రోజు రత్నమాచారి, రాష్ట్ర కార్యదర్శి వింజమూరి వెంకటాచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఏకే నరసింహా చారి, సుంకోజు పోతులూరి చారి, పెరికేటి నాగరాజు చారి, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుముర్తి గోవర్ధన చారి, నాయకులు కన్నకంటి రామాచారి, మారోజు సుదర్శనచారి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద కుటుంబాన్ని ఆదుకుంటాం

సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ

సింగరేణి కాలనీలో అగ్ని ప్రమాద కుటుంబంతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయశ్రీ, కార్పొరేటర్ శ్వేత, తదితరులు

సైదాబాద్, ఏప్రిల్ 16 : సింగరేణి కాలనీ ఘనపురం గుడిసెల్లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కాలిపోయిన గుడిసె బాధిత రమేష్ కుటుంబాన్ని బుధవారం సైదాబాద్ తహసీల్దార్ జయ శ్రీ, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత, తదితరులు పరామర్శించారు. విద్యుదాఘాతంతో గుడిసె కాలిపోవడంతో అందులో విలువైన వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యాయి. అదే విధంగా నిత్యావసర వస్తువులు, పుస్తకాలు వంటివి కాలిబూడిద కావడంతో బాధితులు తమకు న్యాయం చేయాలని అధికారులను, నాయకులను, ప్రజా ప్రతినిధులను వేడుకున్నారు. ఈ సందర్భంగా సైదాబాద్ తహసీల్దార్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆదుకోవడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకుంటానని, అగ్నిప్రమాదంపై నివేదికను ప్రభుత్వానికి అందజేస్తానని ఆమె తెలిపారు. ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, ఐ ఎస్ సదన్ డివిజన్ బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ గోధుమల పట్టివేత

బడంగ్‌పేట్, ఏప్రిల్ 16: గుట్టు చప్పుడు కాకుండా పీడీఎస్ గోధుమలను తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జెడ్పీ రోడ్ లో ఉన్న శ్రీ రమణ కాలనీ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పీడీఎస్ గోధుమలను తరలిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. సంతోష్‌నగర్ చెందిన మహమ్మద్ కసీఫ్(29), బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ కు చెందిన సత్యనారాయణ ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. హోండా యాక్టివా పై పీడీఎస్ గోధుమలను సేకరిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 11.5 క్వింటాల గోధుమల బస్తాలను, హోండా యాక్టీవ్‌ను స్వాధీనం చేసుకున్నామని, వారిద్దరిని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి కార్పొరేటర్ విరాళం

ఆలయ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న బన్నాల ప్రవీణ్

రామంతాపూర్,ఏప్రిల్ 16: రామంతపూర్ గోఖలేనగర్‌లో ఆలయ పునర్నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయానికి రూ.1,00,116లు విరాళాన్ని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బుధవారం ఆలయ ప్రతినిధులకు చెక్కు రూపంలో అందించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర రావు , దయాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి,జగన్,ప వన్ శ్యామ్, బంటీ గౌడ్ , ప్రధాన అర్చకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ

దాసర్లపల్లిలో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీలు

కందుకూరు , ఏప్రిల్ 16: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగానికి తూట్లు పొడవడానికి చూస్తున్నారని మాజీ జెడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ కృష్ణా నాయక్ తెలిపారు . బుధవారం మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో జై బాబు, జై భీమ్, జై సబిధాన్ కార్యక్రమాన్ని మార్కెట్ డైరెక్టర్ యుగేందర్ గౌడ్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ, కేంద్రంలో 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, రాణప్రతాపరెడ్డి, డైరెక్టర్ సురేందర్, యువ జన కాంగ్రెస్ అధ్యక్షుడు సౌడపు వెంకటేష్ గౌడ్, సౌడపు శేఖర్ గౌడ్, బుక్క పాండురంగారెడ్డి, సంజీవరెడ్డి, లింగమయ్య, శ్రీరాములు మహేష్, ఖాదర్, శేఖర్, రమేష్, నరసింహ, అలీ, పుష్పా దర్శన్ , నరేష్ పాల్గొన్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష జవాబు పత్రాల నకలు

పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్) తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. inలో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజును వచ్చే నెల 19వ తేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 2016-17 విద్యాసంవత్సరంతో పాటు ఆ తరువాత డిగ్రీ కోర్సుల్లో చేరిన వారు ఈ వన్ టైం చాన్స్ పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులని వివరించారు. సాధారణ పరీక్ష ఫీజుతో పాటు ఒక్కో పేపర్ కు రూ.2,000 చొప్పున అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్.వై.డి. క్లినికల్ సైకాలజీ రెండు, మూడో సంవత్సరం రెగ్యులర్, బ్యాక్ లాగ్, ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ సెకండ్ పార్ట్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ బీఈ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (సీబీసీఎస్) ఏఐసీటీఈ కోర్సులు, బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి రెండు వారాల తర్వాత పొందవచ్చు అని చెప్పారు. ఈ రీవాల్యుయేషన్ కు ఒక్కో పేపర్కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 26వ తేదీలోగా టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్ కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 28వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు శిక్షణ

అడ్డగుట్ట, ఏప్రిల్ 16: అప్స టెక్ మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నాలుగు నెలల పాటు శిక్షణను అందిస్తున్నట్లు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపి బుధవారం ప్రకటనలో తెలియజేశారు. 20-27ఏళ్ల వయసు గల బీఎస్సీ, ఎమ్మెల్సీ, బీఫార్మ, ఎంఫార్మా, బికామ్,ఏంకామ్ విభాగాలలో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మెడికల్ కోడింగ్‌లో (మెడికల్ టెర్మినాలజీ, హ్యూమన్ అనాటమీ, పిసియాలజీ, ఐసిడి-10 సిపిటి, హెచ్ సిపీటి, ఆర్ సి ఎం)బిల్లింగ్ టెర్మినాలజీ, ఎమ్మెస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, ఇంగ్లీష్ టైపింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ లో శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆసక్తిగల విద్యార్థులు 915499 0132, 91549 90131, 91549 90130 నెంబర్లకు సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

హక్కుల సాధనకు ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు

కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ రవిప్రకాశ్

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16 : ఉద్యోగుల హక్కుల సాధన, ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు ఐక్యంగా ఉద్యమించాలని సంయుక్త ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నిర్ణయించింది. జిల్లాలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం లో ఉద్యోగులపై పెరుగుతున్న ఒత్తిళ్లు, వాగ్దానాల అమలులో జాప్యం, ఆర్థిక సమస్యల నేపథ్యం లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సంఘాలు ఒకటిగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యోగ సంఘాలు జేఏసీ కింద ఏకతాటిపై పోరాడినట్లే, ఇప్పుడు మళ్లీ ఉద్యోగుల హక్కులను, ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేనునెలలు గడిచినా, ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీగా పేర్కొన్న పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్న డిమాండ్‌కు ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఉద్యోగుల ఆరోగ్య సమస్యలకు సంబంధించి మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండడం, క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డుల అమలు చేయలేదన్నారు. జీపీఎఫ్‌లు కూడా సమయానికి జమ చేయడం లేదని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కూడా ఇంకా కార్యరూపం దాల్చలేదని తెలిపారు. 317 జీవో బాధితుల సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జేఏసీ కార్యవర్గం

జేఏసీ చైర్మన్‌గా రవి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా జి.వినోద్ కుమార్, రామేశ్వర్ గౌడ్, భరత్‌కుమార్, కురుమూర్తి, కో చైర్మన్‌లుగా వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, సుధాకర్, రాఘవేందర్, రాజు, శ్రీనివాస్, మోహన్ రావు, సంతోషి, కేఆ ర్ రవికుమార్, సృజన, జగదీశ్వర్, రాజ్‌కుమార్, వైస్ చైర్మన్‌గా సామ్యూల్ పాల్, విజయలక్ష్మి, ఆనంద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మదన్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, ప్రచార కార్యదర్శిగా రవీందర్, కార్యదర్శులుగా గిరి కాంత్, బ్రహ్మచారి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, వినోద్‌కుమార్, నజీమా, సునీత, భాస్కర్ గౌడ్, కార్తీక్, యాదగిరి, మాణిక్యం, వేణుగోపాల్, శ్రీధర్, రవియాదవ్‌లు ఎన్నుకున్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

చర్లపల్లి, ఏప్రిల్ 16: ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని హత్య చేసిన ఘటనలో ఓ బాలున్ని అరెస్టు చేసిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రాజస్థాన్ రాష్ట్రం కు చెందిన ఓ బాలుడు బతుకుదెరువు కోసం నాలుగు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చి హెచ్‌బీకాలనీలోని ఓ హార్డ్ వేర్ షాప్‌లో పనిచేస్తూ కమలాదేవి(70) నివాసంలో అద్దెకు ఉంటున్నాడు. కాగా తన నివాసంలో అద్దెకు ఉంటున్న ఆ బాలున్ని అద్దె విషయంతో పాటు చెత్త తరలింపు క్రమంలో కమలాదేవి కోపగించుకోవడంతో కమలాదేవిపై ఆ బాలుడు కక్ష పెంచుకున్నాడు. కమలాదేవిని ఎలాగైన చంపాలని నిర్ణయించుకొని పథకం ప్రకారం ఈనెల 11న రాత్రి కమలాచౌదరి చంపాలని ఉద్దేశంలో ఆమె ఉంటున్న ఉంటే పోర్షన్‌కు వెళ్లి తనను పనిలో నుంచి తొలగించారని తలుపు తీయాలని కోరడంతో ఆమె తలుపు తీసింది. అనంతరం అకలి వేస్తుందని చెప్పడంతో ఆమె రోటీ చేసి ఇస్తుండగా తలుపు పక్కన ఉన్న ఇనుప రాడుతో తలపై మోదడంతో ఆమె కిందపడిపోవడంతో వెంటనే ఆ బాలుడు పక్కనే ఉన్న చీరతో గొంతు చుట్టూ బిగించి అనంతరం తన సెల్‌ఫోన్‌లో కమలాచౌదరి కనిపించేలా వీడియో ఆన్‌చేసి ఆమెపై నృత్యం చేశాడు. అనంతరం ఆమె మెడకు చీరతో గట్టిగా బిగించి కిటికి గ్రిల్‌కు కట్టాడు. అక్కడ వస్తువులను పారవేసి గుర్తు తెలియని దుండగులు చంపిన విధంగా గదిని రూపొదించి అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం యథావిధిగా పనిచేసుకుంటూ అతని స్నేహితులైన సురేందర్, మహావీర్‌సింగ్, విజయ్‌సింగ్‌లకు కమలాచౌదరిపై తీసిన వీడియోలను పంపిం చి అక్కడి నుంచి పారిపోయేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని ఆ బాలున్ని అరెస్టు విచారించడంతో వృద్ధురాలిని హత్య చేసినట్లు ఒప్పుకున్నట్ల